క్లుప్తంగా

వెంకన్నకు బంగారు గొలుసు బహూకరణ


అర్చకుడికి బంగారు గొలుసు అందజేస్తున్న దాత అమ్మాజీ

అమలాపురం టౌన్‌: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరు గాంచిన అమలాపురం వెంకటేశ్వర స్వామికి పట్టణానికి చెందిన వెంకట అమ్మాజీ అనే భక్తురాలు రూ.లక్ష విలువైన 13.08 గ్రాముల బంగారు గొలుసును శనివారం బహూకరించారు. స్వామి దేవస్థానంలో బంగారు గొలుసును ఆమె అర్చకులకు అందించారని దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు తెలిపారు.

లోక్‌ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం టౌన్‌: మార్చి 8న అమలాపురం కోర్టులో జరిగే లోక్‌ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్‌ సర్వీసెస్‌ కమిటీ చైర్మన్‌ వి.నరేష్‌ సూచించారు. ఈ లోక్‌ అదాలత్‌కు న్యాయవాదులు, పోలీసు అధికారులు, బ్యాంక్, రెవెన్యూ అధికారులు పాల్గొని కేసులను పరిష్కరించుకునే దిశగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

త్వరిత గతిన పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే శ్రీనివాస్‌ అశోక్‌

యానాం: నియోజకవర్గ పరిధిలో శనివారం ఎమ్మెల్యే శ్రీనివాస్‌ అశోక్‌ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. రాజీవ్‌ రివర్‌బీచ్‌లో నూతనంగా నిర్మాణం చేస్తున్న 'ఐ లవ్‌ యానాం' లోగో పనులను పరిశీలించారు. సుభద్రనగర్‌లో పలు రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పీడబ్ల్యూడీ ఇన్‌చార్జి ఈఈ కాళ్ల నాగరాజు, చెల్లి గోపి, సంతోష్‌ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం టౌన్‌: జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాలను అంగన్‌వాడీ టీచర్లు సద్వినియోగం చేసుకోవాలని డీవైఈవో సూర్యప్రకాశం సూచించారు. స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్‌ నెహ్రూ మున్సిపల్‌ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీలకు జరుగుతున్న శిక్షణా కార్యక్రమాన్ని డీవైఈవో శనివారం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎస్‌.దుర్గాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ, రిసోర్స్‌ పర్సన్లు నందెపు శ్రీనివాస్, కాలెపు కిషోర్‌కుమార్, జనిపె మహేష్‌తో పాటు అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువు తవ్వకాలను అడ్డుకున్న మత్స్యకారులు

అల్లవరం: కొమరగిరిపట్నం శివారు సీతారామపురం తీర ప్రాంతం ఆనుకుని తవ్వుతున్న చెరువులను ఎస్‌.రామేశ్వరం ప్రాంతానికి చెందిన కొందరు మత్స్యకారులు శనివారం అడ్డుకున్నారు. ఈ భూములు ఎస్‌.రామేశ్వరం మత్స్యకార సొసైటీకి చెందిన భూములని వాదనకు దిగారు. అయితే ఈ భూములు తమ పూర్వీకుల నుంచి తనకు వారసత్వంగా వచ్చినవని, అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని కొమరగిరిపట్నం గ్రామానికి చెందిన రైతు వారికి తెలిపారు. ఆ భూములు మత్స్యకార సొసైటీకి చెందినవా కావా అనేది రెవెన్యూ, మత్స్యశాఖాధికారులు నిర్ధారించాల్సి ఉంది.

ఉత్సాహంగా కవలల దినోత్సవం


పాఠశాలలో కవల జంటలతో ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్‌: స్థానిక విద్యానిధి స్కూలులో కవల దినోత్సవం సందర్భంగా ఆరు కవల జంటల పిల్లలతో శనివారం ఉపాధ్యాయులు ఆత్మీయంగా కవలల దినోత్సవాన్ని నిర్వహించారు. కవల పిల్లలకు వారి మధ్య సరదాగా పలు పోటీలు నిర్వహించి ఆనందించారు. కవల జంటలకు విద్యానిధి విద్యా సంస్థల చైర్మన్‌ ఆకుల బాపన్న నాయుడు, ప్రిన్సిపాల్‌ నాగ మాధవి, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు వారితో సరదాగా గడిపారు.

బుద్ధ గయ పరిరక్షణకు చర్యలు చేపట్టాలి

అమలాపురం టౌన్‌: బౌద్ధుల పవిత్ర స్థలమైన బుద్ధగయ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని బుద్ధిస్ట్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా (బీఎస్‌ఐ) జిల్లా శాఖ డిమాండ్‌ చేసింది. అమలాపురం గడియారం స్తంభం సెంటరులో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు పెనుమాల సుధీర్‌ అధ్యక్షతన శనివారం జరిగిన సభ బుద్ధగయపై దాడిని తీవ్రంగా ఖండించింది. అనంతరం గడియారం స్తంభం సెంటరు నుంచి ముమ్మిడివరం గేటు సెంటరు, నల్లవంతెన మీదుగా జిల్లా కలెక్టరేట్‌ వరకూ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌లో జాయింట్‌ కలెక్టర్‌ నిశాంతికి తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందించారు.

చెత్త నిర్వహణపై మండిపాటు

- శ్మశాన వాటికను డంపింగ్‌ యార్డుగా మార్చడంతో ఆగ్రహావేశాలు
- ఆందోళన చేపట్టిన 12 వార్డుల ప్రజలు
- చెత్తను తీసుకువచ్చిన వాహనాల అడ్డగింపు
- హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిరసన


శ్మశాన వాటిక వద్ద ధర్నా చేస్తున్న 12 వార్డుల నాయకులు, ప్రజలు

అమలాపురం టౌన్‌: ప్రజారోగ్యంతో చెలగాటమాడొద్దని డంపింగ్‌ యార్డ్‌ చెత్తతో హిందూ శ్మశాన వాటికను చెత్తతో నింపొద్దని అమలాపురం మున్సిపల్‌ డంపింగ్‌ యార్డు, శ్మశానం వద్ద 12 వార్డుల ప్రజలు శనివారం ఉదయం నిరసనకు దిగారు. పార్టీలకు అతీతంగా జనం తరలి వచ్చి ఈ నిరసనలో భాగస్వాములయ్యారు. ఉదయం 7.30 గంటల నుంచి 10.30 గంటల వరకూ అక్కడే ధర్నా చేపట్టారు. డంపింగ్‌ యార్డ్‌కు చెత్తతో వచ్చిన ట్రాక్టర్లు, టిప్పర్లను అడ్డుకున్నారు. డంపింగ్‌ యార్డ్‌లో చెత్తను దించేందుకు వీలు లేదంటూ భీష్మించారు. దీంతో మూడు గంటల పాటు యార్డ్‌ వద్ద చెత్త వాహనాలు నిలిచిపోయాయి. సమస్య జటిలమై, నిరసన ఉధృతమవుతున్న క్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ కేవీఆర్‌ఆర్‌ రాజు, పట్టణ ఎస్సై కిషోర్‌బాబు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో చర్చలు జరిపారు. మీ ఆందోళనను, డిమాండ్లను జిల్లా కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకు వెళ్లాలని కమిషనర్‌ రాజు స్పష్టం చేశారు. మీ సమస్యకు నాలుగు రోజుల గడవు ఇవ్వండి. ఈ లోగా తగు నిర్ణయం తీసుకుంటామని కమిషనర్‌ రాజు ఆందోళన కారులను అడిగారు. చివరకు ఆందోళన కారులు నాలుగు రోజులు గడువు ఇస్తున్నాం.. ఈ లోగా సమస్య పరిష్కరిస్తే సరేసరి, లేని పక్షంలో ఈ నెల 27 నుంచి ఆందోళనను ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. దానికి మున్సిపల్, పోలీసు అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు.

డంపింగ్‌ యార్డు పేరుతో పక్కనే ఉన్న హిందూ శ్మశానాన్ని కూడా చెత్తలో నింపేస్తున్నారని ఆ వార్డు కౌన్సిలర్‌ చిత్రపు రామకృష్ణ ధ్వజమెత్తారు. డంపింగ్‌ యార్డ్‌ సమీపంలోనే తనకు వ్యాపార గొడౌన్లు ఉన్నాయని, అందులో 150 మంది వరకూ పని చేస్తున్నారని ఆ గొడౌన్ల యాజమాని పిన్నంరాజు దుర్గరాజు తెలిపారు. చెత్త కుప్పలకు తరుచూ నిప్పు పెట్టడం వల్ల వచ్చే దట్టమైన పొగకు గొడౌన్లలో పనిచేసే కార్మికులు అనారోగ్యం పాలవుతున్నారని వివరించారు. ప్రధాన పంట కాల్వ పక్కనే పారుతుంటే అక్కడే డంపింగ్‌ యార్డ్‌కు ఎలా అనుమతులు ఇచ్చారని అధికారుల తీరుపై మండి పడ్డారు. 12 వార్డులకు చెందిన నాయకులు వంటిద్దు వెంకన్నాయుడు, కముజు రమణ, కల్వకొలను తాతాజీ, కుడుపూడి శేషాద్రి, ముత్తాబత్తుల గణేష్, సుంకర సుధ, కల్వకొలను ఉమ, చింతా బాలరాజు, దొంగ చిన్నా తదితరులు ధర్నా పాల్గొని నినాదాలు చేశారు. ఆందోళన అనంతరం మున్సిపల్‌ కౌన్సిలర్లు స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుకు వినతి పత్రం అందించారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్‌ చైర్మన్‌ తిక్కిరెడ్డి వెంకటేష్, పాలక పక్ష కౌన్సిలర్లు సంసాని బులినాని, మట్టపర్తి నాగేంద్ర, గొవ్వాల రాజేష్, ప్రతిపక్ష కౌన్సిలర్లు యేడిద శ్రీను, బొర్రా వెంకటేశ్వరరావు, గండి హారిక, తిక్కా సత్య లక్ష్మి తదితరులు ఎమ్మెల్యేను కలిసి డంపింగ్‌ యార్డ్‌ సమస్య తీవ్రతపై చర్చించారు.


ఆందోళనకారులు అడ్డగించడంతో నిలిచిపోయిన మున్సిపాలిటీ చెత్త వాహనాలు

మహా శివరాత్రి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు

ఆర్డీవో మాధవీలత


శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవీలత, డీఎస్పీ ప్రసాద్

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అమలాపురం ఆర్డీవో బి.మాధవీలత దేవస్థానం, పోలీసు, రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఆలయాన్ని శనివారం ఆమె అమలాపురం డీఎస్పీ ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. మహా శివరాత్రి సందర్భంగా చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో మాట్లాడుతూ జిల్లాలో కుండలేశ్వరం, మురమళ్ల వీరేశ్వర స్వామి ఆలయంతో పాటు భైరవపాలెంలో సైతం శివరాత్రి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామన్నారు. తొలుత ఆర్డీవో, డీఎస్పీలు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం

సైకిల్‌ యాత్రికుడు ముత్తు సెల్వన్‌

అమలాపురం టౌన్‌: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ఈ నినాదంతోనే తాను 'ర్యాలీ ఫర్‌ ఆక్సిజన్‌' పేరుతో పలు దేశాల్లో సైకిల్‌ యాత్ర నిర్వహిస్తున్నానని తమిళనాడు రాష్ట్ర కోయంబత్తూర్‌కు చెందిన ముత్తు సెల్వన్‌ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్‌ బాలుర ఉన్నత పాఠశాలకు తన సైకిల్‌ యాత్రతో శనివారం వచ్చిన సెల్వన్‌ మొక్కలు నాటి ప్రసంగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్‌.రాజరాజేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మున్సిపల్‌ కమిషనర్‌ కేవీఆర్‌ఆర్‌ రాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తన సైకిల్‌ యాత్రలో భాగంగా పలు దేశాల్లో ఇప్పటి దాకా దాదాపు 11 లక్షల మొక్కలు నాటానని సెల్వన్‌ చెప్పారు. మొక్కల ఆవశ్యకతను వివరిస్తూ విద్యార్థులు పాడిన పాటలు విని ముత్తు సెల్వన్‌ ఆనందించారు.


పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న ముత్తు సెల్వన్‌

వసతి గృహానికి ఆర్థిక సాయం

అమలాపురం టౌన్‌: రావులపాలెం శుభోదయం దివ్యాంగుల హాస్టల్‌కు స్థానిక సర్‌ సీవీ రామన్‌ స్కూలు యాజమాన్యం రూ.30 వేలు విరాళంగా సమకూర్చింది. ఈ మొత్తాన్ని హాస్టల్‌ మేనేజర్‌ ఈశ్వర్‌కు స్కూలు డైరెక్టర్‌ రవణం వేణుగోపాలరావు శనివారం అందజేశారు.

దివ్యాంగ విద్యార్థుల నమోదును పెంచాలి

డీఈఓ షేక్‌ సలీం బాషా


ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న డీఈఓ

ముమ్మిడివరం: దివ్యాంగ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్‌ సలీం బాషా సూచించారు. ముమ్మిడివరం ఎయిమ్స్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో శనివారం సాహిత విద్య సమన్వయ కర్త ఎంవీవీ సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి పరీక్షలు రాయబోతున్న దివ్యాంగ విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సమన్వయ కర్త ఎంవీవీ సత్యనారాయణ భవిత కేంద్రాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి వివరించారు. సహిత విద్యలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులను సత్కరించారు.

సెలూన్లు, పార్లర్ల తనిఖీలు

అమలాపురం టౌన్‌: పట్టణంలోని సెలూన్‌ అండ్‌ పార్లర్లను పట్టణ సీఐ వీరబాబు, ఎస్సై కిషోర్‌ బాబు శనివారం తనిఖీలు చేశారు. ఆయా పార్లర్లను పోలీసు అధికారులు ఆద్యంతం పరిశీలించి వాటి నిర్వాహకులకు సూచనలు చేశారు. సెలూన్‌ కం బ్యూటీ పార్లర్లలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా నిర్వహించాలని సూచించారు.


అమలాపురంలోని ఓ సెలూన్‌ అండ్‌ బ్యూటీ పార్లర్‌లో సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ వీరబాబు

మహిళా సంరక్షణ చట్టాలపై అవగాహన

అల్లవరం: గోడిలోని డాక్టర్‌ అంబేడ్కర్‌ గురుకులంలో మహిళా సంరక్షణ చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఎస్సై హరీష్‌కుమార్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రూరల్‌ సీఐ ప్రశాంత్‌ కుమార్‌ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మైనర్‌ బాలికలు, మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని వాటిని ఉపయోగించుకోవాలన్నారు. పని ప్రదేశంలో ఉన్నతాధికారుల వేధింపులు, ఈవ్‌ టీజింగ్‌ జరిగితే పోలీసులకు సమాచారం అందించి రక్షణ పొందాలని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్‌ నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని, అపరిచిత వ్యక్తులు బ్యాంక్, ఓటీపీ వివరాలు అడిగితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ప్రిన్సిపాల్‌ కిరణ్మయి, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

27న విశ్వేశ్వరస్వామికి అన్నాభిషేకం

తాళ్లరేవు: అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో 26వ తేదీన విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, మంటపారాధన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, 27న అన్నాభిషేక పూర్వక రుద్రాహవచనం నిర్వహించనున్నట్లు వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వర శర్మ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


పేరూరులో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న డీపీవో శాంతలక్ష్మి


అల్లవరంలో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న డీపీఓ శాంతాలక్ష్మి

డీపీవో శాంతలక్ష్మి

అమలాపురం రూరల్‌: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని జిల్లా పంచాయతీ అధికారి శాంతలక్ష్మి పేర్కొన్నారు. పంచాయతీ రాజ్‌ శాఖ కమిషనర్‌ ఆదేశాల మేరకు స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని పేరూరు గ్రామంలో ఆమె పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామన్, సచివాలయ కార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శానిటేషన్‌ డ్రైవ్‌ పరిశీలన

అల్లవరం: స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బోడసకుర్రు గ్రామంలో శనివారం నిర్వహించిన మాస్‌ కలెక్షన్‌ డ్రైవ్‌ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతాలక్ష్మి పరిశీలించారు. గ్రీన్‌ అంబాసీడర్లు ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను సేకరించే విధానాన్ని పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి దుర్గా శ్రీనివాస్‌ పాల్గొన్నారు. అల్లవరంలో ఈఓపీఆర్‌డీ నాగేంద్ర ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంపై ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు.



కోరికలు ఈడేర్చే కల్పవల్లి.. సత్తెమ్మతల్లి


జాతరకు ముస్తాబైన సీహెచ్‌ గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయం

- నేడు జాతర, తీర్థ మహోత్సవాలు
- అమ్మవారి ఊరేగింపునకు తరలి రానున్న భక్తులు


సత్తెమ్మతల్లి

ముమ్మిడివరం: సిరుల తల్లి.. కోర్కెలు ఈడేర్చే కల్పవల్లి.. భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్న ముమ్మిడివరం మండలం సీహెచ్‌ గున్నేపల్లిలోని సత్తెమ్మ తల్లి జాతర, తీర్థ మహోత్సవాలు నేడు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. సుమారు ఐదు రోజుల పాటు జరిగిన తీర్థ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారి భారీ ఊరేగింపు, మహా కుంభ నైవేద్యం వంటి ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయి. కోనసీమ తలుపులమ్మగా పిలవబడే సీహెచ్‌ గున్నేపల్లి సత్తెమ్మతల్లి ఆలయం ప్రత్యేకతను సంతరించుకుంది.

ఇదీ వృత్తాంతం..

ఏభై ఏళ్ల క్రితం వ్యవసాయాధారిత గ్రామమైన చేయ్యేరు గున్నేపల్లి గ్రామ పొలం గట్లపై ముదుసలి సంచరిస్తూ ఉండేది. పొలం పనుల్లో పురుగు, పుట్ర వంటి వాటి బారిన పడి ప్రమాదంలో ఉన్న రైతులను ఆ ముదుసలి కాపాడుతూ ఉండేది. తరచూ రైతులకు తారసపడే అ ముసలామెను మీరు ఎవరు.. ఎక్కడ నుంచి వచ్చారు అని అడిగితే మాది పక్కఊరు.. అక్కడ పోషణ లేక ఇక్కడకు వచ్చాను.. అంటూ సమాధానం చెప్పి అదృశ్యమయ్యేది. ఇలా కొన్నాళ్లు గడిచిన తరువాత ఆ గ్రామానికి చెందిన రైతులు ఉంగరాల స్వామినాయుడు, గొలకోటి సూర్యనారాయణ, మేకల పల్లయ్య లు ఆ ముదుసలిని శక్తి స్వరూపిణిగా భావించి పూజించడం మొదలు పెట్టారు. ఆ గ్రామంలో రైతులు పొలం పనులు మొదలు పెట్టే ముందు ఆ అమ్మకు మొక్కుకొని పనులు ప్రారంభించేవారు. 1974 లో ఆ ముగ్గురు రైతులు పొలం గట్టుపై అమ్మకు ఆలయం కట్టి జాతర, తీర్థ మహోత్సవాలు నిర్వహించడం ప్రారంభించారు. కాలానుగుణంగా శక్తి అమ్మవారు సత్తెమ్మ తల్లిగా రూపాంతరం చెందింది. అప్పటి నుంచి మహా శివరాత్రి ముందు వచ్చే ఆదివారం నాడు అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. గ్రామానికి చెందిన గొలకోటి వంశీయులు అమ్మవారి పుట్టింటి వారిగా, మేకల వంశీయులు అత్తింటి వారిగా మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల ప్రజలు వ్యాపార, ఉద్యోగ, వ్యవసాయ రంగాలలో ఏ పని మొదలు పెట్టినా అమ్మవారిని దర్శించుకుని అ పని పూర్తవ్వాలని మొక్కుకుంటారు. వారి పనులు నిర్విఘ్నంగా పూర్తయిన వెంటనే అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

51 వసంతాలు పూర్తి

ఈ ఏడాది 51 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మహోత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆకట్టుకోనున్నాయి. నేడు అమ్మ వారి తీర్థ మహోత్సవాలు వైభవోపేతంగా జరగనున్నాయి. దీనిలో భాగంగా అమ్మవారి భారీ ఊరేగింపు జరగనుంది. ఈ ఊరేగింపులో సుమారు 2వేల మంది కళాకారులతో నిర్వహించే వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ చూపరులను మంత్ర ముగ్ధులను చేస్తోంది. ఆదివారం భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించనున్నారు.